క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జ్యోతి

అమరాపురం: స్థానిక కన్యాక పరమేశ్వరి ఆలయం వెనుక భాగంలో ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ జ్యోతి, ఓంకార్‌నాయక్ 200 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బసవరాజు, అజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

12న మార్కెట్ల వేలం

గుడిబండ: మండల కేంద్రంలోని వారపు సంత కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంత, దినసరి, బస్టాండ్ సుంకం వసూలుకు బహిరంగ వేలం పాటను ఈనెల 12న నిర్వహించనున్నట్లు సర్పంచ్ కరుణాకర్‌గౌడ్ తెలిపారు. వారపు పశువుల సంతకు రూ.6 లక్షలు, వారపు కూరగాయల సంత మార్కెట్‌కు రూ.లక్ష , దినసరి బస్టాండ్ సుంకం వసూలుకు రూ.50 వేలు ముందుగా డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

శుభకార్యం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామ సర్పంచ్ గిరిజమ్మ మనవడి నామకరణ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పాల్గొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర కుంచిటి వక్కలిగ బీసీ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, మాజీ రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ డాక్టర్ నళిని, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మాజీ డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై చిన్నారి యువనగౌడ్‌ను ఆశీర్వదించారు.

అపూర్వ సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న పూర్వవిద్యార్థులు

హిందూపురం: పట్టణంలోని చిన్న మార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 2010–2011లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అ స్కూల్‌లోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. స్నేహితులతో నాటి జ్ఞాపకాలు పంచుకున్నారు. అలాగే నాటి గురువులను సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు.

వాహనాల తనిఖీ




వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని జాతీయ రహదారి కొండూరు క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేంద్ర , సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. రోడ్డు భద్రతపై వాహనాదారులకు అవగాహన కల్పించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.

కంచిసముద్రంలో పోలీసుల పల్లెనిద్ర

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం రాత్రి సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు, ఆస్తి వివాదాలు, మహిళా రక్షణ, ఆత్మహత్యల నివారణ తదితర విషయాలపై ప్రజలను చైతన్య పరిచారు.

పులమతి విద్యార్థిని ప్రతిభ



అవార్డు అందుకుంటున్న నిషిత

లేపాక్షి: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత ఏడాది డిసెంబర్ 22న వాధాన్య టాలెంట్ టెస్ట్‌ను పుట్టపర్తిలో నిర్వహించారు. ఇందులో భాగంగానే లేపాక్షి మండలం పులమతి పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న కే.నిషిత మండల టాపర్‌గా అవార్డు దక్కించుకుంది. ఆదివారం బహుమతి ప్రదానోత్సవం సందర్భంగా రూ. 4 వేల నగదుతో పాటు ట్రోఫీ, సర్టిఫికెట్ అందుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజ రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయం వద్దకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణంలో వంటకాలు చేసి స్వామివారి ఎదుట నైవేద్యంగా సమర్పించారు.



ఇక్కడ కనిపిస్తున్నది పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ. 950 ఇళ్లు మంజూరు కాగా 700 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పటికే 500 కుటుంబాలు కాలనీలో నివాసం ఉంటున్నాయి. జగనన్న కాలనీలో తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో బోరు వేసినా నీరు పడకపోవడంతో ప్రజలు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి దాహార్తితో పాటు కనీస అవసరాలు తీర్చుకుంటున్నారు.



ఇక్కడ చేతిపంపుతో నీటిని పట్టుకుంటున్నది పెనుకొండ మండలం బండ్లపల్లి వాసులు. ఈ గ్రామంలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా ఉపయోగం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య అధికం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాహం.. దాహం !



పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా బోర్లలో నీటి మట్టం తగ్గిపోతుండటంతో నీటికష్టాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. తాగునీరు ఇచ్చేలా చూడండి మహాప్రభో అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నారు.

- వేసవి ప్రారంభంలోనే పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు
- గుక్కెడు నీటి కోసం అవస్థ పడుతున్న గ్రామీణులు
- కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితి
- సమస్య పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొర

పెనుకొండ: నగర పంచాయతీ అయిన పెనుకొండలో 20 వార్డులు ఉన్నాయి. చాలా చోట్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పెనుకొండ నగర పంచాయతీలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో నీటి సమస్య ఎంతో కాలంగా వేధిస్తోంది. పలుమార్లు నగర పంచాయతీ అధికారులను కలసి తమ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వేడుకున్నా శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారం చూపించడం లేదని చెబుతున్నారు. కాలనీలో 95 శాతం మంది కూలీ పనులే చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ట్యాంకర్లు కొనే స్తోమత తమకు లేదని నీటి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు. అలాగే దర్గాపేట, తదితర ప్రాంతాల్లో సైతం తరచూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు.

మడకశిర నియోజకవర్గంలో...

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ మండలాల్లోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లోని బోర్లలో అరకొరగా నీరు వస్తుండడంతో నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. అదే విధంగా బోర్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య కారణంగా ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

మడకశిరలో..

మడకశిర మండలం టీడీపల్లి తండా గ్రామంలో బోరు నీరు అరకొరగా వస్తున్నాయి. కొత్త బోరు మంజూరు చేయాల్సి ఉంది. ఎగువ రామగిరి గ్రామంలోని వాటర్ స్కీమ్ బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అవస్థ పడుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే నీటి సమస్య ఉండదు. పత్తికుంట గ్రామంలో కూడా వాటర్ స్కీమ్ బోరులో నీరు అరకొరగా వస్తున్నాయి. కొత్త బోరు మంజూరు చేసి నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

రొళ్లలో..

రొళ్ల మండలంలోని హనిసేకుంట, కొడగార్లుగుట్ట కాలనీ, దొడ్డేరి ఇందిరమ్మ కాలనీలోని బోర్లలో అరకొరగా తాగునీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలనీల్లో కొత్త బోర్లు వేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలి.

అమరాపురంలో...

అమరాపురం మండలం నాగోనహళ్లి, తమ్మడేపల్లి, వీరపసముద్రం, హెచ్‌బీఎస్ కాలనీల్లోని బోరుల్లో అరకొరగా నీరు వస్తుండటంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అగళిలో...

అగళి మండలంలోని అగళి, హెచ్‌డీ హళ్లి గ్రామాల్లో వాటర్ స్కీమ్ బోర్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గుడిబండలో...

గుడిబండ మండలంలోని జంబులబండ గొల్లహట్టి గ్రామంలో వాటర్ స్కీమ్ బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు అమర్చి నీటి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

హిందూపురం నియోజకవర్గంలో...

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలోని హిందూపురం పట్టణం, లేపాక్షి మండలాల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు అవస్థ పడుతున్నారు. హిందూపురం పట్టణంలో 11, 12వ వార్డులకు సంబంధించి మోడల్ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. మోడల్ కాలనీలో గత నెల రోజుల నుంచి 15 రోజులకు ఒక్కసారి కూడా నీటిని వదలకపోవడంతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. లేపాక్షి మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా 39 గ్రామాలు ఉన్నాయి. కల్లూరు, కంచిసముద్రం, పులమతి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య పట్టిపీడిస్తోంది. చిలమత్తూరు మండలంలోనూ కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది.

నీరు కొనాల్సిన దుస్థితి



మా కాలనీలో విపరీతమైన నీటి సమస్య ఉంది. ఒక ట్యాంకర్ నీరు రూ. 600. తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకుంటున్నాము. ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా తూతూ మంత్రంగా ఉపశమన చర్యలు చేపడుతున్నారు. కాలనీవాసులంతా పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలి.

– లక్ష్మీ, జగనన్న కాలనీ, పెనుకొండ

పరిష్కారం చూపడం లేదు



తిమ్మాపురంలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు. పలుమార్లు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే స్థానికులతో కలసి ఆందోళన చేపడతాం. వేసవి తీవ్రత పెరుగుతోంది. వెంటనే అధికారులు కాలనీలో పర్యటించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– రమేష్, సీపీఎం నాయకులు, పెనుకొండ

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి



మడకశిర నియోజకవర్గంలోని గ్రామాల్లో వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. వాటర్ స్కీమ్ బోరులో నీరు తక్కువగా వస్తున్న గ్రామాల్లో వెంటనే కొత్త బోరు వేయించాలి. అదే విధంగా వాటర్ స్కీమ్ బోర్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య లేకుండా అవసరమున్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి తాగునీటి నీటికి ఇబ్బందిలేకుండా చూడాలి.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త , మడకశిర

అధికారులు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారు?



నియోజకవర్గంలోని హిందూపురం పట్టణం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంది. మా దృష్టికి అనేక మంది నీటి సమస్య ఉన్నట్లు చెబుతున్నారు. అధికారులు, టీడీపీ నాయకులు ఏమి చేస్తున్నట్లు? ఎమ్మెల్యే బాలకృష్ణ ఎలాగూ రారు. ఆయనకు సినిమాలు తప్ప మరో ధ్యాస లేదు. స్థానిక నేతలు స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. హంద్రీనీవా జలాలు అన్నారు. వాటి ఊసే ఎత్తడం లేదు. సమస్యను పరిష్కరించకపోతే రోడ్డెక్కి పోరాటాలు చేసేందుకు వెనకాడము.

– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, హిందూపురం

నీళ్లు వదిలి 15 రోజులైంది



మా కాలనీలో నీటి సమస్యను పట్టించుకునే నాథుడు లేడు. టీడీపీ నాయకులు చెప్పిన చోట్లకు నీళ్లొదులుతారు. మిగిలిన వారిని వదిలేస్తున్నారు. నెల రోజులుగా నీటి సమస్యలతో బాధపడుతున్నాం. 15 రోజులకు ఒక్కసారి కూడా నీటిని ఇవ్వకపోవడం బాధాకరం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. మాకు నీటిని విధిగా వదలాలి. నీటి సమస్య లేకుండా చేయాలి. లేకపోతే ఖాళీ బిందెలతో ధర్నా చేయాల్సి వస్తుంది.

– శ్రీరాములు, మోడల్ కాలనీ, హిందూపురం

కొత్త బోర్లు వేయిస్తున్నాం

మడకశిర నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 50కు పైగా గ్రామాల్లో కొత్త బోర్లు వేశాం. బోర్లల్లో అరకొరగా తాగునీరు వస్తున్న గ్రామాల్లో కొత్త బోర్లు వేయిస్తాం. రెండు రోజుల్లో పత్తికుంట, ఆలదపల్లి గ్రామాల్లో కొత్త బోర్లు వేయిస్తున్నాం.

– నాయక్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మడకశిర డివిజన్

ఘనంగా మహిళా దినోత్సవం



లేపాక్షి: డాక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు



పావగడ: మహిళా కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని ఆశ్రయ సేవా ట్రస్ట్‌లో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద యోగా డాక్టర్ సాహితీ మాట్లాడుతూ చాలా మంది మహిళలు పీసీఓడీ సమస్యలు, విటమిన్ లోపంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. అందుకు ఉత్తమ ఆహారం, యోగాను కచ్చితంగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు నళినాక్షి, మహిళా అధ్యక్షురాలు అక్క మహాదేవి, ట్రస్ట్ సభ్యులు శివకుమార్, చిక్కరుద్రప్ప, జగదీష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పావగడ: స్థానిక కస్తూర్బాగాంధీ వసతి పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక హెల్ప్ సొసైటీ సేవా సంస్థ, శమి వృక్ష అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మధ్యాహ్న భోజన పథకం ఉద్యోగులు, పాఠశాల వంట కార్మికులను సన్మానించారు. హెచ్‌ఎం సావిత్రమ్మ మాట్లాడుతూ మహిళలు వంట గదికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతుండటం హర్షణీయమన్నారు.

డేటా ప్రొటెక్షన్ చట్టం అమలు చేయొద్దు



మాట్లాడుతున్న ఆర్‌టీఐ అవేర్‌నెస్ కమిటీ సభ్యులు

హిందూపురం: డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ద్వారా సమాచార చట్టం సెక్షన్ 44 (3)ని అమలు చేయకుండా రద్దుచేయాలని రైట్ టు ఇన్ఫర్మేషన్ అవేర్‌నెస్ కమిటీ సంస్థ రాష్ట్ర కన్వీనర్ పి. హబీబ్ ఉర్ రహమాన్ అన్నారు. ఆదివారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం సెక్షన్ 44(3) ద్వారా ఆర్టీఐ చట్టాన్ని సవరించడం వల్ల సమాచార హక్కు చట్టం బలహీన పడుతుందన్నారు. ఆర్టీఐ చట్టం సెక్షన్ 8(1)(జే)కు చేసిన సవరణ చేసి వ్యక్తిగత సమాచారాన్ని పొందే హక్కు పరిధి నుంచి మినహాయించాలని చూస్తోందన్నారు. దీనిని వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఆర్‌టీఐ అవేర్‌నెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జి.సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏటూరి చిన్నపోతలయ్య, రెవిన్యూ డివిజన్ అధ్యక్షుడు షేక్ అయాజ్ , హిందూపూర్ మండల అధ్యక్షుడు వి.చంద్రశేఖర్, సెక్రటరీ ఓ.మనోజ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

సోమందేపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సోమందేపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో డివిజన్‌స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ కమిషన్ 2023లోనే పూర్తయిందని , ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు చెల్లించి భవిష్య నిధి, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండర్ లీవ్‌లను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కిష్టప్ప, డివిజన్ నాయకులు శ్రీనివాసులు, బాబు, కాలయ్య, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సంప్రోక్షణ పూజలు

మడకశిర: పట్టణంలో వెలసిన కోట వేంకటరమణ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ పూజలు ముగిశాయి. మూడు రోజుల పాటు ఆలయంలో సంప్రోక్షణ పూజల సందర్భంగా వేద పండితులు వివిధ హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్టాపన చేశారు. అలాగే కుంభాభిషేకాన్ని కూడా ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు. చివరి రోజు మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖులు సంప్రోక్షణ పూజలో పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



నాగేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న చర్చి సభ్యులు

హిందూపురం: పట్టణానికి చెందిన డాక్టర్ ఏ.నాగేంద్రకుమార్ చేసిన విశిష్ట సేవలనుగాను విశాఖపట్నంలోని ఏపీ థియలాజికల్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో సేవా రత్న లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్‌లో ఆదవారం చర్చి పెద్దలు అవార్డు గ్రహీతను ఘనంగా సత్కరించారు. ఎస్‌డీజీఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా క్రైస్తవుల హక్కుల పరిరక్షణకై కృషిచేస్తున్నారని పేర్కొన్నారు.

నష్టాల ఊబిలో టమాట రైతు



పొలంలోనే టమాటను వదిలేసిన దృశ్యం

రొద్దం: మార్కెట్లో టమాట ధర పడిపోవడంతో రైతులు కుదేలవుతున్నారు. ధర పతనం కావడంతో రొద్దం కొట్టాలకు చెందిన రైతు రాజగోపాల్ 5 ఎకరాల్లోని పంటను పశువులకు వదిలేశారు. రూ.10 లక్షల దాకా పెట్టుబడి పెట్టినా ధర లేక తీవ్రంగా నష్టపోయాయని బాధిత రైతు రాజగోపాల్ వాపోయారు. దిగుబడి బాగా వచ్చినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కేజీ రూ.3 నుంచి రూ.2 పలుకుతుండటంతో పంటను తొలగించి మార్కెట్‌కు తరలిస్తే కూలీల ఖర్చులు కూడా రాదన్నారు.

మహిమాన్వితుడు.. కణివె నృసింహుడు

- 12 నుంచి బ్రహ్మోత్సవాలు
- 13న కల్యాణం, 14న బ్రహ్మ రథోత్సవం



లక్ష్మీ నరసింహస్వామి మూలవిరాట్



కణివె లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పావగడ: పట్టణంలోని తుమకూరు రోడ్డు సమీపంలో వెలసిన కణివె లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం స్వస్తి వాచన, పంచామృతాభిషేకం, మహా మంగళారతి ఇస్తారు. ఆ రోజు రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 13న పుష్పాలంకారం, రాత్రికి స్వామి వార్ల కల్యాణోత్సవం, 14న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని అత్యంత వైభవంగా జరగపనున్నారు. 15న నిత్య హోమం, వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయి. 16న అభిషేక పూజలు, మహా మంగళారతి, రాత్రికి శేషవాహనోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహ గోపాల్ ఆధ్వర్యంలో జరుగుతాయి. 14న జరిగే బ్రహ్మ రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ అభివృద్ధి సమితి గౌరవాధ్యక్షుడు కే జ్ఞానేశ్‌బాబు, కార్యాధ్యక్షుడు ఎస్ మాధవన్ కోరారు.

ఇదీ ఆలయ చరిత్ర ..

రాక్షసుడైన హిరణ్యకశ్యపుడు బ్రహ్మ వరంతో ఇంద్రాది దేవతలను పదవీచ్యుతులను చేసి వారిని తన బానిసలుగా చేసుకుని తనకు బద్ధ శత్రువైన శ్రీహరికి పూజలు చేయడం, కొలువడాన్ని నిషేధిస్తారట. ఈ నేపథ్యంలోనే మానవులు, దేవతలను హింసించసాగాడట. హిరణ్య కశ్యపుడి ఆగడాలు మితిమీరి పోవడంతో మహా విష్ణువు నరసింహావతారంతో హిరణ్య కశిపుడిని వధించారట. అయినా నారాయణుడి ఉగ్ర రూపం ఉపశమనం కాలేదు. వైకుంఠపురంలో ఉన్న శ్రీలక్ష్మి తన రూపాన్ని పోగొట్టుకుని భూలోకంలో అడవుల్లో సంచరిస్తూ బేడర చెంచు లక్ష్మి అనే కన్యలో నిక్షిప్తమైందట. నృసింహుని అవతారంలోనే భూలోకంలో శ్రీలక్ష్మి కోసం కొండలు, గుట్టలను తొక్కుతూ వెదకలాడు తుండగా ఆయన పాదాల తాకిడికి రాళ్లు ఉబ్బి శిలలుగా మారి నృసింహుని అంశాన్ని పొందాయట. స్వామిని అనుసరిస్తున్న లక్ష్మీదేవి సైతం ఉబ్బిన శిలలో చేరుకుంది. అలా.. లక్ష్మీ సమేత నరసింహస్వామి పావగడ కణివె లక్ష్మీనరసింహ దేవాలయంలో ఉద్భవమూర్తిగా కొలువు తీరారు. 1939లో నిర్మించిన ఇక్కడ ఆలయాన్ని నిర్మించి భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చేదైవమైన నృసింహుడిని ఎంతో మంది తమ ఇంటి దైవంగా కొలుస్తున్నారని అర్చకులు చెబుతున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

సోమందేపల్లి: యువకులు డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవాద్దని ఎస్ఐ రమేష్ బాబు సూచించారు. ఆకతాయిలుగా మారిన కొందరు యువకులను ఆదివారం సాయంత్రం స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.